క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాంసి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ మంజుల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

16న జైనథ్‌లో..

జైనథ్: ఈనెల 16న మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

ఆర్థిక సాయం

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన నిరుపేద మోహిజ్ ఖాన్ కుమార్తె వివాహానికి సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ బుధవారం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, ఫిరోజ్ ఖాన్, బాబాఖాన్, సికిందర్ రాథోడ్, కోరైల మహేందర్, మహ్మద్ ఖురేషి పాల్గొన్నారు.

విరాళం అందజేత

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో యువకుల సౌకర్యార్థం గ్రామస్తులు గ్రంథాలయం నిర్మాణం చేపడుతున్నారు. కాగా బుధవారం గ్రామానికి చెందిన లోటస్ షాప్ యజమాని గంద్రత్ సంతోష్, జీవన్‌లు తమ వంతుగా రూ.15వేల విరాళం అందజేశారు. గ్రామపెద్దలు సదానంద్, రాజు, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ ఎంపీడీవోగా రవీంద్రనాథ్


రవీంద్రనాథ్

జైనథ్: జైనథ్ ఎంపీడీవోగా రవీంద్రనాథ్ బాధ్యతలు స్వీకరించారు. జైనథ్ ఎంపీడీవోగా పనిచేసిన గజానన్ రావు నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ ఎంపీడీవో జైనథ్‌కు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది, అధికారులు ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు.

వేతనాలు విడుదల చేయడం హర్షణీయం


మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తమ వేతనాలు విడుదల చేయించడం హర్షణీయమని తెలంగాణ మెడికల్ హెల్త్ అండ్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని సంఘం కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి వేతనాలు అందేలా చేశారని, ఆమెతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు సైతం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోథ్: సొనాల గ్రామానికి చెందిన పలువురు నాయకులు బుధవారం కాంగ్రెస్ నాయకులు అడే గజేందర్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సొనాల గ్రామంలో, దేవుల నాయక్ తండా గ్రామంలో డ్రెయినేజీ, సీసీరోడ్లు నిర్మాణం పనులు చేపట్టారు. వెంట సోనాల పట్టణ అధ్యక్షుడు, చెట్లపెల్లి అనిల్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రమేశ్ బత్తుల, గాజుల పోతన్న, విజయ్ భాస్కర్ రెడ్డి, మహ్మద్ బాయ్, సాకారం, రోహిదాస్, బలిరామ్, సాదశివ్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న అభిమాని

బోథ్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు నిలువెత్తు బంగారం (బెల్లం)ని సమర్పించారు ఓ అభిమాని. మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన ఉద్దల్ సింగ్ అనిల్‌జాదవ్ ఎమ్మెల్యేగా గెలిస్తే, నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తానని మొక్కుకున్నాడు. కాగా బోథ్ ఎమ్మెల్యేగా గెలవడంతో బుధవారం కాలు బాబా ఆలయంలో నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు.

సన్మానం

కైలాస్‌నగర్: జీహెచ్‌ఎంసీకి బదిలీపై వెళ్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ శైలజను బుధవారం ఘనంగా సన్మానించారు. నూతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు శాలువాతో సత్కరించారు. జ్ఞాపికను బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు ఇచ్చేదెప్పుడో?

- డీడీ కట్టి 18 నెలలు గడుస్తున్న వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు


గొర్రెలు

ఆదిలాబాద్‌రూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల, కురమల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సబ్సిడీపై గొర్రెల యూనిట్లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఏ, బీ గ్రూపులుగా విభజించి ఏ గ్రూప్‌లోని లబ్ధిదారులకు గత రెండేళ్ల కిందట గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. బీ గ్రూపులోని లబ్ధిదారులకు రెండో విడత పంపిణీ కోసం లబ్ధిదారుల నుంచి డీడీలు సైతం స్వీకరించారు. అందులో కొంత మందికి యూనిట్లను పంపిణీ చేయగా.. మరికొంత మందికి పంపిణీ చేయాల్సి ఉంది. డీడీలు కట్టి సుమారు 18 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు గొర్రెల యూనిట్లు అందడం లేదు. రెండో విడతలోని లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ యూనిట్లు అసలు ఉంటాయో? లేదోనని ఆందోళన చెందుతున్నారు.

కొంత మందికే పంపిణీ..

గత ప్రభుత్వం ఒక్క గొర్రెల యూనిట్‌కు రూ. 1.75 లక్షలుగా ధర నిర్ణయించింది. ఇందులో లబ్ధిదారుడి వాటా కింద రూ. 43,750 కాగా మిగితా రూ. 1,31,250 ప్రభుత్వం చెల్లిస్తోంది. రెండో విడత కింద ఆదిలాబాద్ రూరల్ మండలంలో 500 మంది లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా.. గత ఏడాది అగష్టు, సెప్టెంబర్ మాసంలో కేవలం 77 మందికి మాత్రమే యూనిట్లు అందజేశారు. మావల మండలంలో సుమారు 400 మందికి యూనిట్లు పంపిణీ చేయవాల్సి ఉండగా.. కేవలం 80 మంది లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేశారు.

వడ్డీలు చెల్లించక ఆర్థికంగా ఇబ్బందులు..

గొర్రెలు యూనిట్లు వస్తాయని భావించిన కొంత మంది పేద లబ్ధిదారులు డీడీలు చెల్లించడంతో వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ప్రభుత్వ సాయం అందక మరోవైపు ఉపాధి మార్గం మెరుగు పడక గొల్ల, కురమలు అయోమయానికి గురవుతున్నారు. గొర్రెల యూనిట్లు ఇవ్వాలని లేదంటే తమ వాటా కింద చెల్లించిన వాటిని వడ్డీతో చెల్లించాలని కోరుతున్నారు.

యూనిట్లు ఇచ్చేలా చూడాలి



మా కుటుంబంలో నాలుగు గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. డీడీలు చెల్లించి 18 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు యూనిట్ల పంపిణీ ఊసే ఎత్తడం లేదు. అసలు గొర్రెల యూనిట్లు ఇస్తారో లేదో తెలియడం లేదు.

– వినోద్, లబ్ధిదారుడు, లాండసాంగ్వి

ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



గొర్రెల యూనిట్లు మంజూరవుతాయంటే మా కుటుంబంలో రెండు గొర్రెల యూనిట్ల కోసం రూ. 87,500ల డీడీలు చెల్లించాం. వాటి పంపిణీపై అసలు ఊసే ఎత్తకపోవడంతో ఆందోళనను కలిగిస్తోంది. యూనిట్లు మంజూరైతే ఉపాధి లభిస్తోంది.

– సురేశ్, లబ్ధిదారుడు, లాండసాంగ్వి

ఎలాంటి ఆదేశాలు రాలేదు

రెండో విడతలో కొంత మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్‌లను అందజేశాం. మిగితా వారి పంపిణీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి యూనిట్ల పంపిణీకి ఆదేశాలు రాగానే అందజేస్తాం. ప్రస్తుతం వాటి పంపిణీ ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉంది.

– సురేశ్, మండల పశువైద్యాధికారి, ఆదిలాబాద్ రూరల్

అమర జవాన్లకు నివాళులు

ఆదిలాబాద్: సైనిక అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ పుల్వామా జిల్లాలో జరిగిన దాడిలో అసువులు బాసిన సీఆర్పీఎఫ్ అమర జవాన్లకు జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆయన పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. దేశ రక్షణలో జవాన్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అనంతరం సైనికుల కుటుంబసభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: 2019 ఫిబ్రవరి 14న పుల్వామ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన అమర వీర జవాన్లకు మండలంలోని శివాజీ చౌక్ వద్ద బుధవారం గ్రామస్తులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వీర నందయ్య, చట్ల ఉత్తం, పాండు, కిషన్, మోహన్, అరుణ్, సుకుమార్, చందు, సాయికృష్ణ, విక్రమ్, ప్రశీత్, దీపక్, బాలు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగం చిరస్మరణీయం

కైలాస్‌నగర్: దేశ రక్షణ కోసం అమరులైన జవాన్ల త్యాగం చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్గిల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద కౌన్సిలర్లతో కలిసి నివాళులర్పించారు. అలాగే యువజన సంఘాల నాయకులు సైతం కార్గిల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, ఉపాధ్యక్షుడు పసుపుల రాజు, అర్పత్ ఖాన్, అబ్దుల్ అజీజ్, గణేష్ వర్మ, దొంతుల ప్రవీణ్, శ్రీకాంత్, హుసేన్, సావిన్ రెడ్డి పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్: నివాళులర్పిస్తున్న గ్రామస్తులు


కైలాస్‌నగర్: నివాళులర్పిస్తున్న జోగు ప్రేమేందర్

నార్నూర్: పుల్వామా దాడిలో అమరులైన వీర సైనికులకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం మాజీ సైనికులు నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ సైనికులు రమేశ్, వినోద్‌లు మాట్లాడుతూ.. 14 ఫిబ్రవరి 2019న జమ్మూ కాశ్మీర్ జాతీయ రహదారిపై భారత సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలపై దాడి చేయడంతో సైనికులు అమరులయ్యారని అన్నారు. పుల్వామా దాడి ఘటనకు నిరసనగా ప్రతీ ఏడాది ఫిబ్రవరి 14న బ్లాక్ డేగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.


నార్నూర్: మౌనం పాటిస్తున్న మాజీ సైనికులు

బోథ్: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లను స్మరించుకుంటూ బోథ్ మండల కేంద్రంతో పాటు కౌఠ(బి) గ్రామంలో జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆయా పార్టీల నాయకులు, సామాజిక సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతపంచమి వేడుకలు


నేరడిగొండ: అక్షరాలు దిద్దిస్తున్న బాలయ్య స్వామి


తలమడుగు: అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితులు

బజార్‌హత్నూర్: మండలంలోని ఆలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్, ఎస్సీ పాఠశాల, కురుక్షేత్ర పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్కం తిరుమల, మాజీ సర్పంచ్‌లు పరచ సాయన్న, లావణ్య, వొర్ని వెంకట రమణ, నందుకుమార్, సబ్బిడి నవీన్, మణికంట, వినిల్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలయ్య స్వామి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి గాజుల రాజ నర్సయ్య, సమితి అధ్యక్షుడు పాల రాజేశ్వర్, సమితి కార్యదర్శి సోలంకి చందర్‌సింగ్, సాబ్లే సంతోష్ సింగ్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: వసంత పంచమి పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో వేద పండితులతో సాముహిక అక్షరాభ్యాస చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు రమణ, మంజుల, పద్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్‌లో..

బోథ్: మండల వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.

దర్గా ఉత్సవాలకు తరలిరండి


మాట్లాడుతున్న మహమ్మద్ అష్రఫ్

ఎదులాపురం: చాందా రాజన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలను ఈనెల 16వ నుంచి నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అష్రఫ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. శుక్రవారం షాహి సందల్ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈనెల 18న మహిఫిలే సమా కవ్వాలీ, 20న ఉర్సు, కవ్వాలి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్‌లో గురువారం నిర్వహించే సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని ప్రేమ్ సింగ్ రామావత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్, లింబాజీ, రామ్‌రావు, అర్జున్, గణేష్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


గోమాతలను ఆలింగనం చేసుకుంటున్న సభ్యులు

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణకు యువత పాటుపడాలని గో సేవ సమితి అధ్యక్షుడు గణేష్ వర్మ అన్నారు. వాలెంటైన్స్ డేను నిరసిస్తూ ప్రపంచ గో ప్రేమికుల దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌహగ్ డేలో భాగంగా గోమాతలను ఆలింగనం చేసుకొని వాటికి నమస్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతిని విస్మరించాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైతాంగంపై లాఠీచార్జీ సరికాదు


మాట్లాడుతున్న జిల్లా నాయకులు జగన్‌సింగ్

ఎదులాపురం: పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం లాఠీచార్జీ చేయడం సరికాదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు హరించడాన్ని ఖండించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేట్‌పై ఉన్న ప్రేమ దేశానికి అన్నం పెడుతున్న రైతుల మీద ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మోదీని గద్దె దించాల్సిన అవసరం దేశ ప్రజలకు ఉందని గుర్తు చేశారు. ప్రజా, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న అఖిలపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న గ్రామీణ బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సురేశ్, అయ్యు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి

తలమడుగు: అందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరైన రూ. 5లక్షల రూపాయాలతో మాల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రతిఒక్కరూ ఐక్యంగా ఉంటేనే సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల విద్యార్థులు అంబేద్కర్ స్ఫూర్తితో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బోల్లారపు బాబన్న, వెంకన్న యాదవ్, నడిపన్న, శ్రీనివాస్ రెడ్డి, ఫరూక్, గణేష్, సుభాష్, లింగన్న, భుమన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వన్‌టౌన్ ఎస్సై హబీబ్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు లైసెన్స్ పొందిన తర్వాతే వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఎండీ కలీమ్, ఉదయ్ కుమార్, ఏఎస్సై దైవశాల, సిబ్బంది రాములు, సుభాష్, కోటేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తాగునీటికి కటకట


చేతిపంపు వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

- నెల రోజులుగా నిలిచిన భగీరథ నీరు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లా రూపాయలు ఖర్చు పెడుతున్నా.. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కనీసం పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహంలో దాదాపు 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగు నీటికి అవస్థలు పడుతున్నారు. అన్నం తిన్న తరువాత ప్లేట్లను చేతిలో పట్టుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న చేతి పంపు వద్ద, కస్తూరిబా గాంధీ పాఠశాల బయట ఉన్న చేతిపంపు వద్ద వెళ్తున్నారు. ఉదయం పూట స్నానానికి బయటకు వెళ్తే గ్రామస్తులు తిడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా గత మూడు రోజుల నుంచి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయిబాబా పల్లకిని వీధులు గుండా ఊరేగించారు. జాతర సందర్భంగా శివాజీ చౌక్ నుంచి సిరికొండ వరకు భక్తులతో కిక్కిరిసిపోయింది. సీఐ భీమేష్, ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోథ్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబా ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నేరడిగొండ ఎంపీపీ సజన్‌లాల్, భీంపూర్ జెడ్పీటీసీ కుంర సుధాకర్, తిరుమల్‌గౌడ్, పాండురంగ్, నర్వాడే రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన గర్భిణి గత సంవత్సరం ప్రసవ సమయంలో మృతి చెందింది. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆమె పేరుపై ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం కింద రూ.రెండు లక్షలు ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరు కావడంతో బుధవారం గోకొండ గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మృతురాలి కుటుంబసభ్యులకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. బ్యాంకు మేనేజర్ జగదీష్, పాతిమ రిజ్వీ, మాజీ సర్పంచ్ రుక్మిణిజంగు పాల్గొన్నారు.